# శృంగభంగం

కథానిక

యేర్లగడ్డ శివరామకృష్ణ

బస్సుకే సీట్లుదొరక్కపోతే యింక ఏం చెయ్యగలం? పెళ్ళికెళ్ళకపోతే వాళ్ళ నిష్ఠూరాలు. తీరా వెళ్దామని బయలుదేరితే ఈ బస్సులో ఖాళీ దొరక్క నానాయాతనా పడటం! ఈ పెళ్ళిళ్ళు చేసుకునేవాళ్లు సంవత్సరం పొడుగునా లగ్నాలు దొరకనట్టు మూకుమ్మడిగా వేసవికాలంలోనే చేసుకుంటారు మనప్రాణం తియ్యడానికి.

వచ్చేబస్సులు వస్తున్నాయి. వెళ్ళేబస్సులు వెళ్తున్నాయి. ఖాళీదొరకందే! చిరాకెత్తుకొచ్చింది ఏం చెయ్యను?

ఈసారి వచ్చే బస్సులో సీటుదొరుకుతుందనేగ్యారంటీలేకపోయినా,దొరకగలదనే ఆశావాదం లేకపోతే అక్కడ వేచివుండటం కష్టమౌతుంది.ఇంకోబస్సురాకకు కనిపెట్టుకుకూర్చున్నాను. ఇంతలో ఒకచిన్నకారు దుమ్ములేపుకుంటూవొచ్చి నాకు పదిగజాలు దాటినతరువాత ఆగింది. దాని వైపు చూశాను. స్టీరింగు దగ్గరవున్న వ్యక్తి తల బయటకుపెట్టి పిలిచాడు. మొదట నన్ను కాదనుకున్నాను గాని పేరుపెట్టి పిలవడంచేత వెళ్ళాను.

తీరాచూస్తే వాడు జగన్నాథం. "ఏంరోయ్ ఎందాకా వెళ్తున్నావ్ చాలారోజులకు కనపడ్డావ్" అన్నాడు నవ్వుమొహంతో.

సమాధానం చెప్పాను.

"ఆవూరిమీదుగానేగా వెళ్లేది! కారులోఎక్కు వెళ్దాం" అన్నాడు వాడు. మారు మాటేమీ లేకుండా ఎక్కికూర్చున్నాను. ఆ కార్లో నేనూ వాడూతప్ప ఎవ్వరూ లేరు.

జగన్నాథంవంక పరిశీలనగా చూశాను. పూర్వంకంటె వొళ్ళు చేశాడు. సిల్కు సూటులో వున్నాడు. మేం చదువుకునే రోజుల్లో రెండు జతలు తప్ప మూడోజత బట్టలు గట్టిగా కట్టలేని వీడు యీరోజున యిలా అనుభవిస్తున్నాడు.

మనసు ఉండబట్టలేక అడిగాను. "ఏరా కారెప్పుడు కొన్నావ్?"

"నాదికాదురా. మా చిన్నమావయ్యది. అవసరమైనప్పుడు వాడుకుంటూ వుంటాలే."

ఆర్థికంగా చాలా కృశించిపోయిన కుటుంబంలోంచి వొచ్చిన వీడు యీ స్థితిలోకి రావటానికి సరైనమార్గం త్రొక్కితే నేనెంతో సంతోషించేవాడిని.

ఉండుండి నాలో జగన్నాథంమీది ఆలోచనలు ముసిరినై. గడచిపోయిన సంఘటనలు.

వాడీ వున్నతస్థితిలోనికి రావటానికి కొంచెం అడ్డదారి అనుసరించాడు. అందుచేతనే జగన్నాథం చేసినదానిమీద నాకు సానుభూతి లేకపోయింది. భర్త అనుమానించి వొదిలివేసిన శాంతను (ఒకానొక ప్రలోభంతో) భార్యగా స్వీకరించడానికి సిద్ధపడిన్నాడే జగన్నాథంమీద నాకు సానుభూతి పోయింది.

ఆనాడే వీడికి చిలక్కిచెప్పినట్టు చెప్పాను వాడు చేస్తున్నపని ఎంత హేయమైనదో!

"పరస్పరం గాఢంగా ప్రేమించుకున్నాంరా" అన్నాడు జగన్నాథం. నేనమ్మలేదు. నమ్మలేను కూడా. ఎందుచేతనంటే ఆరెకరాల ఆస్తిని ఏడుగురితో కలిసి పంచుకోవలసిన స్థితిలోవున్న వీడికి పెద్దఆస్తి వెనకున్న శాంతమీద (పైగా భర్త వొదిలిపెట్టిన యిల్లాలిమీద) అకస్మాత్తుగా ప్రేమ కలిగిందంటే ఎలానమ్మటం? వాడీఆర్థికదుస్థితిని

తొలగించుకోవటానికే యీ ముసుగు కప్పుకున్నాడని విశ్వసించాను.

భర్తచేత వొదిలివెయ్యబడ్డ వాళ్ళంటే సమాజం ఎలా చూస్తుంది? కేవలం ఆ చూపుల్నుంచి తప్పించుకునే నిమిత్తమే శాంత జగన్నాథాన్ని వొప్పుకుందని నా నమ్మకం. (ఇక్కడ యింకో విషయం. భర్త చెడ్డవాడైనందుకు శాంతే భర్తనుంచి తెగతెంపులు చేసుకుందనీ, ఇప్పుడు జగన్నాథాన్ని చేసుకోవటం ఓ సంస్కరణనీ ఓ అభిప్రాయం వ్యాపించింది. ఆ అభిప్రాయాన్ని శాంతే తెలివిగా ప్రచారం చేసి వుండవచ్చు. ఇల్లా పరస్పరం చేసుకున్న ఆత్మవంచనని నేనవగాహన చేసుకున్నాను.

జగన్నాథం నా వాదాన్ని అంగీకరించలేదు. ఆ సమయంలో నేనేం చెప్పినా వాడు వినే స్థితిలో లేడని తోచినందువల్ల మెదలకుండా వూరుకున్నాను. ఇంకా అంతకంటే నా స్నేహధర్మాన్ని విస్తృతం చెయ్యదల్చుకోలేదు.

"మీ బంధువులింట్లో పెళ్ళెప్పుడన్నావూ. రేపుకదూ" జగన్నాథం నా ఆలోచనల్ని చెదరగొట్టాడు.

"అవునురా! రేపు సాయంకాలం" జవాబిచ్చాను.

"అయితే యివాళ మాయింటికెళ్దాం. రేపు అక్కడికి వెళ్ళొచ్చు.

భార్యా పుట్టింటిని తనయిల్లని వీడు చొరవగా చెప్పుకోవటం నాకు నచ్చలేదు.

"ఎందుకులేరా! మళ్ళీ మీయింటికి ఎప్పుడైనా వీలుచూసుకుని ఓసారి వస్తానుగా" నాకు లోపల వెళ్ళి అత్తారింట్లో వీడనుభవించే ఇల్లరికపుదశ చూడాలని వుంది.

"ఒరే బెట్టుచెయ్యబోకు అనవసరంగా. మా వాడు—అంటే జూనియర్ జగన్నాథాన్ని చూద్దువుగాని" చిన్నగా నవ్వాడు జగన్నాథం.

జూనియర్ జగన్నాథం కలగటం వీడీ ప్రపంచంలో చేసిన మహోత్కృష్ట కార్యంగా ఫీలవుతున్నట్టు జగన్నాథం నవ్వులో నాక్కనిపించింది.

"ఆఁ!-సరే" అన్నాను అంగీకార సూచకంగా.

"ఒరేయ్! నువ్వు చెప్పినట్టు వుండినట్టయితే జీవితంలో ముఖ్యంగా అనుభవించదగిన ఆనందానుభూతుల్ని కోల్పోయేవాడిని... ఆ నాడు నీవలా భావించటానికి నీ అభిప్రాయాలు నీ కున్నాయిలే" అన్నాడు జగన్నాథం.

వీడి ఆత్మవంచనకి పరిమితిలేదా? శాంతా తనూ ఎంతో ప్రేమతో వుంటున్నట్టు నన్ను నమ్మించటానికి వీడుపడే తాపత్రయం అర్థమైంది. ఈనాడు నా అభిప్రాయాలు (వీడి వివాహాన్ని గురించి) మారినవని, లేకపోతే మారాలని వాడభిప్రాయం కాబోలు!

జగన్నాథం విషయమై నేను ఆత్మవంచన చేసుకోనా? అందుకు నేను వొడిగట్టలేను.

డబ్బును చూసి కళ్ళుచెదిరి అదే ఆనందానుభూతిగా నన్ను నమ్మమంటే ఎలా?

మాట మార్చాను.

"జగన్నాథం జూనియర్ నడుస్తున్నాడా, పేరేం పెట్టావ్" కేవలం సభ్యత కోసమే ఈ ప్రశ్నడిగాను.

"నీ పేరే, భుజంగరావు" నవ్వుతూ జవాబిచ్చాడు జగన్నాథం.

వాడి నవ్వులో నాకు సహజత్వం కనిపించలేదు. అసహ్యం వేసింది. నేనింకేమీ వాడిని ప్రశ్నించదలచుకోలేదు.

* * *

జగన్నాథం అత్తా మామా వాడిని ఎలా ట్రీట్ చేస్తారని నేను వూహించానో అలాగే చేశారు. ఏదో మామూలుగా పలకరించారు వాడిని. అల్లుడిని చూడాల్సిన విధంగా వాళ్ళు జగన్నాథాన్ని చూడనట్టు ఆ సాయంత్రంలోగా చాలా నిదర్శనాలు సంపాయించాను. అథవా ఆరోజున వాడికాఇంట్లో ఏమాత్రమైనా గౌరవం చూపటం జరిగిందంటే క్రొత్తవాడిని నేను ప్రక్కన వున్నాను గాబట్టి ఆ మాత్రమైనా చూపక పోతే బాగుండదని వాళ్ళభిప్రాయపడ్డట్టు నేను భావించాను.

పోతే శాంత నాక్కనిపించలేదు. ఆమె ఆ ఊళ్ళో బంధువులింటికి (కొడుకుతో సహా) మేము వచ్చే వేళకే వెళ్ళిందట. సాయంత్రంవరకూ రాలేదు. జగన్నాథంపట్ల శాంత ప్రవర్తనగూడా చూడాలని గట్టిగా కాంక్షించిన నేను ఆశాభంగం చెందాను.

ఆ ఇంట్లో నాకు మర్యాదలు చాలా బాగానే జరిగినై. రాత్రికి బాగా గాలివచ్చే ఏర్పాటుగల దక్షిణంవైపు గదిలో పడుకోవటానికి యేర్పాటు చేశారు. పడుకున్నాను గాని వెంటనే నిద్రపట్ట లేదు. ఏదో ఆలోచిస్తూ పడుకున్నాను.

ఇంతలో పక్కగదిలోంచి స్త్రీ పురుష సంభాషణ వినిపించింది. దానిలో వొకటి ఖచ్చితంగా జగన్నాథం గొంతు. రెండోది శాంత దవ్వొచ్చు.

వాళ్ళ సంభాషణ వినటానికి ఎందుకనో కుతూహలం కలిగి చెవు లప్పగించాను.

“అయితే పిన్నిగారింటిదగ్గర్నుంచి ఎర్ర చీర తెమ్మంటే పచ్చచీర ఎందుకు తీసుకొచ్చారు? పిన్నితో నేను ఎరుపుచీర కొనమని చెప్పొచ్చానే” ఇది శాంత కంఠం.

“మీ పిన్నిదేం తప్పులేదు. ఎరుపుచీర కొన్నది. రాణిగారు మన్నిస్తే ఎర్రని మీ వంటికి పచ్చని చీరైతే అప్సరాంగనలా వుంటారని యీ దీనుడు భావించినవాడై వాళ్ళమ్మాయికని కొన్న చీర తీసుకొచ్చాడు” అంటూ జగన్నాథం నవ్వాడు.

“అబ్బా! అలాగా... పాపం” కిలకిలానవ్వింది శాంత. జగన్నాథం నవ్వు దాంట్లో మిళితమైనది.

“సరేగాని వచ్చిన స్నేహితు డెవరేమిటి” శాంత ప్రశ్న.

“వాడా, భుజంగం. కాలేజీ స్నేహితుడులే. వాడు నీకు తెలిసేవుంటా డనుకుంటాను. అప్పుడు నిన్ను చేసుకోవద్దని నన్ను హెచ్చరించి హితవు చెప్పినవాళ్ళల్లో ప్రథముడు.”

“అప్పుడాయనలా చెప్పటానికి తగ్గ అధారాలు ఆయన కుండవచ్చుగా.”

“ఉన్నాయనే భావించాడు. వాడి మాట పాటించివుంటే నా జీవితం నిస్సారమై, కాంతిహీనంగా తయారయ్యేది.”

“ఎందుకనో” మృదువైన నవ్వుతో శాంత అంది.

“జీవితంలో అడుగడుగునా ఆశలు కల్పిస్తూ జీవితపథాన్ని విరులబాటగా మార్చే ఒక దేవకన్య సహచరిగా లేకుండాపోయినప్పుడు మరి బ్రతుకింకెలా వుండేది?”

“ఆ ఉత్ప్రేక్షల్లో నేను పడిపోదల్చుకోలేదు లెండి.” శాంత సెలయేటి ప్రవాహంలాంటి నవ్వు నవ్వింది.

“నా హృదయానికి కావ్యభాషలో రూపం యిచ్చాను.”

“ఇహ చాల్లెండి. నిద్రొస్తోంది. పవళించండి” శాంత నవ్వింది. జగన్నాథం నవ్వాడు. ఇద్దరూ నవ్వారు. ఆ తరువాత యింకేమీ మాటలు వినిపించలేదు.

నాకు తల కొంచెంగా దిమ్మెరుగొన్నట్లయింది.
ఏమిటి నేను విన్నది?
దీనివల్ల ఏమి నిరూపితమైంది?
ఎవరు ఆత్మవంచన చేసుకుంది?
ఎందుకనో ఉక్కబోసినట్లంది. కిటికీ తలుపులు పూర్తిగా తెలిచేవున్నాయే! కూజాలో చల్లని మంచినీళ్లు రెండు గ్లాసులు త్రాగాను.

* * *

“రాత్రి నిద్రపట్టలేదేవిటిరా కళ్లు ఎర్రబడినై” అన్నాడు జగన్నాథం నేను నిద్రమంచంమీంచి లేస్తుండగా గదిలోకి వచ్చి.

“ఏబ్బే! దివ్యంగా నిద్రపట్టిందిరా! వేడి చెయ్యటంచేత కళ్ళెర్రబడివుంటైలే” అన్నాను నేను సర్దుకుని.

---

ప్రస్తుతపు కేంద్ర మంత్రివర్గంలో ఒకరికి చూపు అంతగా ఆనదట; ఇంకొకరికి శ్రవణేంద్రియం సరిగా పనిచెయ్యదట. ఈ యిద్దరు మంత్రులూ అటుంచి అసలు మంత్రివర్గంలో అధిక సంఖ్యాకులకు ప్రధాని నెహ్రూదగ్గిర నోరు మెదపడం అంటే కాస్త జంకు. అందుకే ఢిల్లీ పత్రికావిలేఖరులు మంత్రివర్గాన్ని వర్ణిస్తూ: “ఒకరికి చెవుడు; ఒకరికి చూపులేదు; తక్కినవారంతా మూగవారు” అని తమలో తాము అనుకుంటారట.